నాటుకోళ్లకు భలే డిమాండ్ !

- నాటు చికెన్, మటన్‌పై జనం ఆసక్తి
- బర్డ్ ఫ్లూతో తగ్గిన బాయిలర్ చికెన్ అమ్మకాలు


తనకంటువారిపల్లి వద్ద ఓ ఇంటి పెరట్లో నాటుకోళ్లు

ధర్మవరం రూరల్: ఇటీవల నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది. ఆదివారం వచ్చిందంటే చాలు ఇళ్లలో నాన్ వెజ్ ఘుమఘుమలాడాల్సిందే. నాటు కోడి పులుసు, మటన్ రాగిముద్ద మోనూ తప్పనిసరై పోయింది. గత కొన్నాళ్లుగా బాయిలర్ కోళ్లకు రోగాలంటూ చాలా మంది వాటిని తినడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్, నాటుకోడి తినడానికి మాంసాహార ప్రియులు ఇష్ట పడుతున్నారు. మటన్ చారు, నాటుకోడి పులుసు కాంబినేషన్‌గా రాగిముద్ద, పూరి కాంబినేషన్‌గా మారింది. కోవిడ్ నేర్పిన పాఠంతో ప్రజలు ఆరోగ్యంపై దృష్టిని సారిస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు మాంసాహారంపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. రాయలసీమ సంప్రదాయవంటకమైన రాగిముద్దకు నాటుకోడి పులుసు, మటన్ మంచి కాంబినేషన్ కావడంతో లొట్టలేసుకొని రెండు ముద్దలు ఇట్టే లాగించేయొచ్చు. ధర్మవరంలో కిలో మటన్ ధర రూ. 750 కాగా నాటుకోడి కూర కిలో రూ.400 దాటినా జనం కొనేందుకు వెనక్కు తగ్గడం లేదు.

భారీగా మటన్ అమ్మకాలు

ధర్మవరంలో 40 దాకా మటన్ దుకాణాలున్నాయి. దీనికి తోడు పల్లెల్లో కొందరు పొట్టేళ్లు, మేకలను కొని ఆదివారం వాటిని భాగాలుగా వేసి విక్రయాలు సాగిస్తున్నారు. ఈ 8 నెలల కాలంలో మటన్ విక్రయాలు ఊపందుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మొన్నటి దాకా మటన్ కిలో రూ.600 ఉండగా ప్రస్తుతం రూ. 750 నుంచి రూ.800 దాకా ధర పలుకుతోంది.

భారీగా వెలసిన హోటళ్లు..

ఈ మధ్య కాలంలో ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, చెన్నేకొత్తపల్లి తదితర ప్రాంతాల్లో హోటళ్లు భారీగా వెలిసాయి. ఈ హోటళ్లలో కేవలం రాగి ముద్ద, చపాతి, మటన్, నాటుకోడి పులుసు మాత్రమే దొరుకుతోంది. మాంసాహార ప్రియులు వీటిలో భోజనాలు చేయడానికి ఇష్ట పడుతుంటారు. ఇక ఆదివారం పూట ఇంటి వంట పేరిట ఇళ్లల్లోనే మటన్, నాటుకోడి పులుసు చేసి రోడ్ల పక్కన వాహనాల్లో విక్రయాలు చేస్తున్నారు.

పార్టీల్లో నాటుకోడి స్పెషల్

గతంలో పల్లెల్లో ప్రతి ఇంటి పెరట్లో నాటుకోళ్లు కచ్చితంగా ఉండేవి. బంధువులు ఇంటికొచ్చినా, పండుగలొచ్చినా కోడి కూర వండే వారు. రాను రాను జీవనశైలి మారడంతో పెరటి కోళ్ల పెంపకం తగ్గింది. బాయిలర్ కోళ్ల వినియోగం పెరిగింది. అయితే జనం మళ్లీ నాటుకోళ్ల పెంపకం పట్ల ఆసక్తి పెంచుకోవడంతో నాటు కోళ్లకు మంచి గిరాకీ పెరిగింది. పుట్టిన రోజైనా, పెళ్లి రోజైనా, మంచి మార్కులు వచ్చినా చాలా మంది పార్టీలు(విందు) పేరిట నాటుకోడి మాంసాన్ని భుజిస్తుంటారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం ఎక్కడ బడితే అక్కడ దొరుకుతుండడంతో మందుతో పాటు నాటు కోడి కూరను చేయించుకొని గ్రామాల సమీపంలోని వ్యవసాయ తోటల్లో విందు చేసుకుంటున్నారు.

కదిరి నుంచి వచ్చి కొనుగోలు చేస్తారు



మా గ్రామంలో చాలా మంది నాటుకోళ్లను పెంచుతారు. ఒక కోడి రెండు కేజీలు కావాలంటే సుమారు 5 నెలలు పాటు పెంచాలి. నాటుకోడి మాంసానికి పట్టణాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో వ్యాపారులు గ్రామాలకు వచ్చి నాటుకోళ్లను కిలో రూ.450 చొప్పునకొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. మంచి ధర ఉండడంతో పలువురు నాటుకోళ్లను పెంపకం చేపడుతున్నారు.
– సుదర్శన్, తనకంటువారిపల్లి

రాగిముద్ద, నాటుకోడి పులుసు ఇష్టం



రాగి ముద్దలోకి నాటు కోడి పులుసు వేసుకొని తినడం అంటే నాకు చాలా ఇష్టం. గతంలో మా ఇంటి వద్ద నాటు కోళ్లను పెంచుకునే వాళ్లం. పండుగలు వచ్చినప్పుడు నాటుకోళ్లను కోసుకొని ఇంటిల్లపాది తినేవాళ్లం. ప్రస్తుతం ఇళ్ల వద్ద నాటుకోళ్లు పెంచడం కుదరలేదు. దీంతో బయట వ్యక్తులతో కొనుగోలు చేసి నాటుకోడి కూరను తింటుంటాం.
– ఓబిరెడ్డి, రేగాటిపల్లి

శాస్త్రీయ సమాజమే జేవీవీ లక్ష్యం


విద్యార్థులను అభినందిస్తూ సైన్స్ కరపత్రాలు చూపుతున్న జేవీవీ నేతలు

ధర్మవరం అర్బన్: మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజమే జేవీవీ లక్ష్యమని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. స్థానిక సుందరయ్యనగర్‌లోని గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన యురేకా సైన్స్ ఎక్స్‌పోలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ మానవాళి ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం చూపేది సైన్స్ మాత్రమేనన్నారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యలో మూఢ నమ్మకాలను చొప్పించే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలన్నారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాలంటే పాఠశాలలు, కళాశాలల్లో అత్యాధునిక ప్రయోగశాలలను అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో రాణించిన విద్యార్థులు మేఘన, తేజస్వినిని అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణరెడ్డి, జేవీవీ పట్టణ కార్యదర్శి నరేంద్రబాబు, ఏపీటీఎఫ్ నాయకులు రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు గోపి, శేఖర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై దాడులు అరికట్టాలి'

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా దళితులపై దాడులు, కులం పేరుతో దూషణలు జరుగుతున్నాయని, దాడులు అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రామలసీమ దళిత సేన జిల్లా అధక్షుడు మంగళమడక శంకర్ కోరారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలో సత్యమ్మ కూడలి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసి నూతన మండల కమిటీలు ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ కంబాలపర్తి బస్టాండ్‌లో సిమెంట్ బల్లపై కొంత మంది దళితులు కూర్చొని ఉంటే అగ్రకులాల వర్గాల వారు కులం పేరుతో దూషిస్తూ కర్రలతో దాడులు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితుల హక్కులపై భవిష్యత్‌లో పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం ముదిగుబ్బ మండల అధ్యక్షుడిగా నరశింహులు, పుట్టపర్తికి ఉత్తప్ప, ఉపడ్యక్షుడిగా సాయికుమార్, ఓడీచెరువుకు చంద్ర, బుక్కపట్నంకు సోముశేఖర్, నల్లమాడకు ఓంప్రకాశ్, ఓడీసీకి రామచంద్ర, బుక్కరాయసముద్రం అధ్యక్షుడిగా నాగభూషణను ఎన్నుకున్నారు.

400 లీటర్ల సారా ఊట ధ్వంసం


పట్టుబడిన నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: నవోదయం 2.0 భాగంగా నాటు సారా నిర్మూలకు మంగళవారం పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పోలీసులు బుక్కపట్నం మండలం మదిరేబైలు గ్రామ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహిటించారు. బసిరెడ్డిపల్లికి చెందిన అశోక్, సోమశేఖర్, రామాంజనేయులు, చిన్నప్పను అరెస్ట్ చేసి 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి 15 లీటర్ల నాటుసారా, 30 కేజీల బెల్లం సీజ్ చేశారు అలాగే బెల్లం విక్రయదారుడు కదిరి టౌన్‌కు చెందిన షేక్ ఏజాజ్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ నరసిహులు, హెడ్‌కానిస్టేబుల్ నాగభూషణం, సురేష్, బాబు, ప్రసాద్, కానిస్టేబుల్ నరసింహారెడ్డి, అల్లాబకాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్ల వితరణ


పాఠశాలకు స్పీకర్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం రూ.30 వేలు విలువ చేసే రెండు స్పీకర్లు, ఆంప్లిఫయర్‌ను వితరణ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జంషీద్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లోనూ పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి సహకారం అందించాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు నాగరాజు, మోతీలాల్, ఫయాజ్ , బషీర్, శ్రీనివాసులు, జయప్ప, ఆంజనేయులు, ప్రకాష్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ధర్మవరం: కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లేబర్ అసిస్టెంట్ కమిషనర్ సూర్యనారాయణ, ధర్మవరం లేబర్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు లేబర్ కార్డులు చేయించుకోవడం వల్ల కలిగే ఉపయోగాను తెలియజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, ప్లంబర్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

తలుపుల : నూతనకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభమైనట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉదయం కలశస్థాపన, కలశ ఆరాధన, గణపతి హోమం, సాయంత్రం నవగ్రహ హోమం, వాస్తు హోమం, కరన్యాస హోయం, మహామంగళ హారతి తీర్థప్రసాదాలు అందించారు. బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటల లోపు ధ్వజ స్థంభ ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ కేబుల్ అపహరణ

బత్తలపల్లి: జ్వాలాపురంలో వ్యవసాయ విద్యుత్ కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. రైతులు హరినాథ్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామాంజనేయులు, చంద్రమోహన్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, రాజేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ పొలాల్లో వ్యవసాయ మోటర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్‌ను దొంగలు కత్తిరించి ఎత్తుకెళ్లారని బాధితులు వాపోయారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నల్లచెరువు: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి నల్లచెరువుకు చెందిన నారే బయపనాయుడు, వీరా, భాను ప్రసాద్, అఖిలేశ్వరి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.లక్ష విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, పడుచూరి నాగేష్, కేసీ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తనకల్లు: స్థానిక సాయినగర్‌కు చెందిన రమణ కుటుంబానికి మిత్రులు మంగళవారం ఆర్థికసాయం అందించారు. రమణ గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి (2003 బ్యాచ్) విద్యార్థులు రమణ తండ్రి చలపతికి రూ.26వేలు అప్పటి ఉపాధ్యాయులు సూర్యానారాయణ, వేమనారాయణ చేతులమీదుగా అందించారు.

మారెమ్మ దేవతకు బోనాలు

కదిరి టౌన్: పట్టణంలోని 17వార్డులో వెలసిన మారెమ్మ అమ్మవారికి పట్టణ వాసులు మంగళవారం బోనాలు పట్టారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జంతు బలి ఇచ్చారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురోగ్యాలతో సుఖసంతోషాలతో చల్లగా చూడాలని కోరుకున్నారు.

రస్తా సమస్యల పరిష్కారం

బత్తలపల్లి: పొలం రస్తా సమస్యలపై పలువురు రైతులు అర్జీలు ఇవ్వడంతో ఆర్డీఓ మహేష్ క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమస్యలను పరిష్కరించారు. మంగళవారం గుమ్మల్లకుంట, చిన్నేకుంటపల్లి, ఉప్పర్లపల్లిలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా సరిహద్దు రైతులతో చర్చించి రస్తా సమస్యకు పరిష్కారం చూపారు. ఉప్పర్లపల్లి గ్రామంలోని రస్తా సమస్యను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ స్వర్ణలతకు ఆర్డీఓ సూచించారు. మండల సర్వేయర్ జోసెఫ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ జయంతి


లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కదిరి టౌన్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో విప్లవ నేత లెనిన్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. మొదటగా ఆయన చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టజీవుల రాజ్యాంగాన్ని తీసుకొచ్చిన గొప్ప మహనీయుడు లెనిన్ అన్నారు. ఆయన చూపిన బాటలో మనం నడవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. జిల్లా వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24 నుంచి 26 వరకు నిరహార దీక్షలు చేపట్టి మే నెల 5 న చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, జీఎల్ నరసింహులు, జగన్‌మోహన్, ముస్తక్, రాంమోహన్, రఫి పాల్గొన్నారు.

వీఆర్‌ఏ సేవలు ప్రశంసనీయం

నల్లమాడ: వీఆర్‌ఏ రెడ్డిపల్లి ప్రసాద్ సేవలు ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. మండలంలోని రెడ్డిపల్లికి చెందిన రెవెన్యూ గ్రామ సహాయకుడు (వీఆర్‌ఏ) ప్రసాద్ ఈనెల 8న మలకవేమల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సంస్మరణ సభ నిర్వహించారు. తహసీల్దార్ వై. రంగనాయకులు మాట్లాడుతూ వీఆర్‌ఏ ప్రసాద్ సేవలను గుర్తు చేశారు. రెడ్డిపల్లి ఉప సర్పంచ్ గంగిరెడ్డి, కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఏలు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

కనగానపల్లి: మండల కేంద్రంలో మంగళవారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోతలయ్య, సల్లాపురమ్మ దేవతలను ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వందలాది మంది మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు. భక్తులు పోతలయ్యస్వామికి మేకపోతులు, పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ముష్టికోవెలలో వైద్య పరీక్షలు

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెల గ్రామంలో మంగళవారం ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ సిబ్బంది టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. పెనుకొండ టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ శశిధర్, సీహెచ్‌ఓ గోవిందమ్మ, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఏఎస్‌ఎం కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహా సమాధిని దర్శించుకున్న మంత్రి


రత్నాకర్ రాజును కలిసిన మంత్రి సవిత

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహా సమాధిని మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత దర్శించుకున్నారు. రోడ్డు మార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌లో పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం చేరుకున్న ఆమె సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాదిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు టీడీపీ నాయకులు కలసి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరించారు.

'మళ్లీ అమరావతి శంకుస్థాపన ఏమిటి?'

ముదిగుబ్బ: ఇది వరకే ఒక సారి అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి శంకుస్థాపన చేయడానికి రావడం ఏమిటని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ముదిగుబ్బలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి వైఖరి చెయ్యాలి చెల్లి పెళ్లి మళ్లీ మళ్లీ అన్నట్లుందని ఎద్దేవా చేశారు. అమరావతికి శంకుస్థాపన చేసి 10 ఏళ్లయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు నిస్సార్ అహ్మద్, ప్రభాకర్, గంగయ్య, అనీల్‌కుమార్, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి టౌన్: రోజురోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ నగేష్ సూచించారు. మంగళవారం పుట్టపర్తి మున్సిపాలిటీ 17వ వార్డు బీడుపల్లిలో అసంక్రమణ వ్యాధులు, వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండలు పెరగుతున్న నేపథ్యంలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగు తీసుకుపోవాలన్నారు. మంచినీరు, పళ్లరసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాధ, అనురాధ, రాజేశ్వరి, ఆశావర్కర్లు గులాబ్‌జాన్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సంజయ్‌నగర్ బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో 2024–25 సంవత్సరానికి వర్క్ అడ్జస్ట్ మీద వచ్చిన ఉపాధ్యాయులు గోవిందు, నాగేంద్రకుమార్, కవిత, సుజాతమ్మ, అశ్వినిని మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమాపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

బత్తలపల్లి: స్టేట్ బ్యాంకులో ఖరీఫ్ సీజన్ కింద పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని బత్తలపల్లి బ్యాంకు మేనేజర్ సుభాష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గడువులోగా రైతులు పంట రుణాలు రెన్యూవల్ చేసుకుంటే వడ్డీలేని రుణం, బీమాకు అర్హులవుతారన్నారు. జూన్ 30 వరకు ఆయా గ్రామాల రైతులు రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

బత్తలపల్లి: ఈదుల ముష్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం వేదపండితులు చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ, హనుమ, వినాయక, గరుడ సమేత విగ్రహాలకు వివిధ రకాల పూజలు, హోమాలు, వస్త్రాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

ముగిసిన భజన ఆలాపన


సంగీత కచేరి నిర్వహిస్తున్న భజన బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి శత జయంతితి వేడుకలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో చేపట్టిన 1,008 భజన గీతాల ఆలాపన కార్యక్రమం మంగళవారం ముగిసింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ఈ నెల 16న 1008 భజన మహోత్సవం ప్రారంభమైంది. వారం రోజుల పాటు 900 మంది గాయనీ గాయకులు వేడుకల్లో పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. 20 భజన బృందాలుగా ఏర్పడి వీరు ఆలపించిన గీతాలతో ప్రశాంతి నిలయంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెల్లివిరిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా మంగళవారం సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరి నిర్వహించారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

గాండ్లపెంట: విద్యార్థి దశలో సత్ప్రవర్తనతో మెలగాలని మండల విద్యాధికారి కృష్ణానాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక గజ్జల చెన్నారెడ్డి కళాశాల ఆవరణలోని కేరళ మోడల్ ఆంగ్ల పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ చిన్నారుల క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం కదిరి ఎంవీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు సంఖ్యకనుగుణంగా పాఠశాల వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ దొడ్డావుల సుదర్శన్‌రెడ్డి, గజ్జల సిద్దారెడ్డి, పాఠశాల కరెస్పాండెంట్ జోసఫ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా


కేతనసింహ

ఎన్‌పీకుంట: తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో గాండ్లపెంట విద్యార్థులు సత్తాచాటారు. స్థానికంగా వీఆర్ఏగా పని చేస్తున్న రూపా, సురేష్ దంపతుల కుమార్తె సాకే కేతనసింహ 981 మార్కులు సాధించింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రెడ్డప్పరెడ్డి కుమారుడు సొంగా భరత్‌కుమార్‌రెడ్డి 464 మార్కులు సాధించాడు. ప్రతిభ చూపిన విద్యార్థులను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.

కళాశాలలో చేర్పించండి


కళాశాల ప్రత్యేకతను వివరిస్తున్న అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలంటూ అధ్యాపకులు విద్యార్థుల తలిదండ్రులను కోరారు. మంగళవారం పట్టణంలోని దుర్గానగర్, సుందరయ్యనగర్, రేగాటిపల్లి రోడ్డు, పోతుకుంట రోడ్డు తదితర వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. నాణ్యమైన విద్య, భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేశారు.

ఈకేవైసీ పూర్తి చేయండి


మాట్లాడుతున్న సీఎస్‌డీటీ కవిత

కనగానపల్లి: రేషన్‌కార్డు లబ్ధిదారుల ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలని సీఎస్‌డీటీ కవిత రేషన్ డీలర్లను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ ప్రసాద్‌తో కలసి ఆమె రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ ప్రగతిపై ఆమె మాట్లాడారు. మండల వ్యాప్తంగా 36,700 మంది లబ్ధిదారులుండగా, ఇప్పటి దాకా 32 వేల మంది దాకా ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన వారి ఈకేవైసీ ఈ నెల 30లోపు పూర్తి చేయాలన్నారు.

ఘనంగా స్కూల్ డే



బ్లూమూన్ పాఠశాలలో స్కూల్ డే నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం స్కూల్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, కార్యదర్శి శ్రీదేవి హాజరయ్యారు. పాఠశాలలో క్రీడలు, అకడమిక్ ఇయర్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేంద్రరెడ్డి, ఇన్‌చార్జ్ మాధవరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు రామాంజులురెడ్డి పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట: 2025–26 ఆర్థిక సంవత్సరం ఎస్సీ కార్పొరేషన్‌ద్వారా అందించే రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసులోపు వారు కులధ్రువీకరణ పత్రం , ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు(ఆధార్ లింక్), బియ్యం కార్డు, విద్యార్హత పత్రాలు, ఈమెయిల్ ఐడీతో మే 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వాహనాల సీజ్

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో లైసెన్స్ లేని మూడు ఆటోలు , రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు. మంగళవారం ఉదయం పోలీసులు పెడపల్లి, పెద్ద తండాలోని ఇంటింటినీ పరిశీలించారు.అలాగే గడ్డి వాములు, వాహనాలు, హోటళ్లు, గోడౌన్లను తనిఖీ చేశారు. 16 మద్యం బాటిళ్లు, లైసెన్స్ లేని మూడు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం రోడ్ సేఫ్టీ, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, శక్తి యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. గొడవలు, అల్లర్ల జోలికివెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

జూదరుల అరెస్ట్

తలుపుల: కుర్లి సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద పేకాట ఆడుతున్న 8 మందిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. వారి నుంచి రూ.11,700 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం


మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అంజినప్ప

ఎన్‌పీకుంట: మండలంలోని గొకనపల్లి ప్రాథమిక పాఠశాలలో మూఢ నమ్మకాలపై గ్రామస్తులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత శుక్రవారం స్థానిక పాఠశాల ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసిన విషయం విదితమే. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురై విద్యార్థులను బడికి పంపడం లేదు. దీనిపై స్థానిక నాయకులు కల్పించుకొని పాఠశాలలో మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అంజినప్ప, ఎస్ఐ వలీబాషా, ఎంఈఓ సుబ్బిరెడ్డి, బీజేపీ నాయకులు సమీఉల్లా, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.